# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక


## మాజీమంత్రి హరీశ్‌రావుకు ఊరట

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు పెట్టిన ఎఫ్‌ఐఆర్‌పై దర్యాప్తును నిలిపి వేస్తూ హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ పోలీస్ అధికారి రాధాకిషన్‌రావులను అరెస్ట్ చేయరాదన్న గత ఉత్తర్వులను పొడిగించింది. తన ఫోన్‌ను ట్యాప్‌చేయించారని చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలని వారిద్దరూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌లను జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదిస్తూ, సుప్రీం కోర్టు సీనియర్ అడ్వొకేట్ సిద్ధార్థలూథ్రా వాదించేందుకు వస్తారని, విచారణను వాయిదా వేయాలని కోరారు. దీనిపై హరీష్ లాయర్ అభ్యంతరం తెలిపారు. పీపీ 3 సార్లు వాయిదా తీసుకున్నారనీ, పోలీసులు మరో పక్క నిందితులను అరెస్టు చేసి వాళ్లతో తమకు అనుకూలంగా వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. దర్యాప్తుపైస్టే ఇవ్వాలని కోరారు.

## ఎవరికీ మినహాయింపుల్లేవ్ !

వాషింగ్టన్ : అమృత్ తెలంగాణ: పరస్పరం టారిఫ్‌లు విధించే విషయమై ఇతర అన్ని దేశాలతో సహా భారత్‌కు ఎలాంటి మినహాయింపులు లేవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. టారిఫ్‌ల విషయంలో తనతో ఎవరూ వాదించలేరని అన్నారు. ట్రంప్, ఎలన్ మస్క్‌లతో సంయుక్తంగా చేసిన ఇంటర్వ్యూను ఫాక్స్ న్యూస్ మంగళవారం రాత్రి ప్రసారం చేసింది. ఆ ఇంటర్వ్యూలోనే ట్రంప్ పై వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 13న వైట్‌హౌస్‌లో ట్రంప్, ప్రధాని మోడీ ద్వైపాక్షిక భేటీకి కొద్ది గంటల ముందే పరస్పర టారిఫ్‌లపై ట్రంప్ ప్రకటన చేశారు. ఈ టారిఫ్ ప్రణాళిక ప్రకారం ఆయా దేశాలు అమెరికా నుండి దిగుమతి చేసుకున్న ఉత్పత్తులపై ఎంత సుంకమైతే విధిస్తాయో అంతే మొత్తాన్ని అమెరికా, ఆయా దేశాల నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై విధించనుంది. ప్రతి ఒక్క విదేశీ వాణిజ్య భాగస్వామికి సంబంధించి ఈ పరస్పర టారిఫ్ అమలవుతుందనిచెప్పారు.


సంపుటి: 01 సంచిక : 148. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.20.02.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# చట్టబద్ధతకు సిద్ధం




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దానికోసం మార్చి 1 నుంచి 5వ తేదీ లోపు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్టు సమాచారం. దీనికోసం మూడు ప్రత్యేక బిల్లులకు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. అయితే ఎస్సీ వర్గీకరణపై తుది బిల్లు ప్రతిని ఏకసభ్య కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రూపొందించనున్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి, చట్టబద్ధత కల్పిస్తారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతంతో పాటు, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ మరో బిల్లును ప్రభుత్వం రూపొందించనుంది. దీనికి సంబంధించి త్వరలోనే మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ముసాయిదా బిల్లులకు తుదిరూపు ఇవ్వనున్నారు. ఆ తర్వాతే దీనికి సంబంధించిన పూర్తి స్థాయి రోడ్ మ్యాప్ తయారవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మూడు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి, చట్టరూపం ఇచ్చిన తర్వాత వాటిని ఆమోదించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. కులగణనపై బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. బీజేపీకి చెందిన కేంద్రమంత్రి బండి సంజరు, జీ కిషన్‌రెడ్డి ముస్లింలను బీసీ జాబితా నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఘాటుగా స్పందించారు. సచార్ కమిషన్ సహా పలు నివేదికల్ని ఆయన ప్రస్తావించి, అప్పట్లోనే ముస్లింలను బీసీలుగా గుర్తించారనీ, బాధ్యత కలిగిన కేంద్ర మంత్రి పదవుల్లో ఉండి, ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని హెచ్చరించారు. మరోవైపు బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడక అంటూ విమర్శలు చేశారు. అయితే దీనిపై 2015, 2019లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సకల జనుల సర్వే నివేదికలను ప్రస్తావించేందుకు ఆపార్టీ నేతలు జంకుతున్నారు. దీన్ని ప్రస్తావిస్తే, ఆ నివేదికలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తుందనే భయం వారిని వెంటాడుతుంది. దీనిపై ఇప్పటికే గత అసెంబ్లీ సమావేశాల్లో అధికారపక్షం ఎంఐఎం సహకారంతో బీఆర్‌ఎస్ తీరును తీవ్రంగా ఎండగట్టింది. అయితే మరోసారి కులగణన చేస్తే, బీఆర్‌ఎస్ శ్రేణులు సహకరిస్తాయని కే తారకరామారావు ప్రభుత్వానికి సవాలు విసిరారు. అనూహ్యంగా దాన్ని స్వీకరించిన ప్రభుత్వం ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు కులగణన సర్వేలో పాల్గొనని వారికోసం మరో అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. దీనికోసం మూడు ఆప్షన్లను కూడా ప్రకటించారు. దీనితో బీఆర్‌ఎస్ ఇరుకున పడింది. తొలివిడత కులగణన సర్వేలో 3,54,75,554 మంది ప్రజలు పాల్గొన్నారని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర జనాభాలో ముస్లిమేతర బీసీ జనాభా 1,64,09,179 మంది (46.25 శాతం) ఉన్నారనీ, బీసీ ముస్లింలు 35,76,588 మంది (10.08 శాతం) ఉన్నారని పేర్కొన్నారు. ఎస్సీ జనాభా 61,84,319 మంది (17.43 శాతం), ఎస్టీ జనాభా 37,05,929 మంది (10.45 శాతం), అగ్రవర్ణ ముస్లింలతో కలిసి మొత్తం ఓసీ జనాభా 56,01,539 మంది (15.79 శాతం) ఉన్నారని లెక్కించిన విషయం తెలిసిందే. కులగణన సర్వేలో కేవలం 3.1 శాతం మంది మాత్రమే పాల్గొనలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. వారు సర్వేలో పాల్గొనేందుకు మరోసారి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మరి ఈ సర్వేలో అయినా మాజీ సీఎం కే చంద్రశేఖరరావు కుటుంబం పాల్గొంటుందో లేదో చూడాలి!

ఆ తర్వాతే ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికలను ఈ రెండు అసెంబ్లీ సమావేశాల తర్వాతే నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఏప్రిల్, మే నెలల్లో విద్యార్థులకు పరీక్షలు ఉన్నందున జూన్‌లో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి జులై రెండోవారానికి ఎన్నికలను పూర్తిచేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. అయితే ఇప్పటికే పలు స్థానిక సంస్థల పాలకమండళ్ల కాలపరిమితి తీరినందున ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది.

మార్చి మూడోవారంలో బడ్జెట్ సమావేశాలు

బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల చట్టబద్ధత అనంతరం మార్చి మూడోవారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు లేని నేపథ్యంలో ఇప్పటి వరకు ఆయా శాఖలు ప్రతిపాదించిన ప్రణాళికల్లో భారీ ఎత్తున మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చింది. దీనితో బడ్జెట్ సమావేశాల్ని మార్చి మూడోవారానికి వాయిదా వేసినట్టు తెలిసింది.

# మళ్లీ అధికారం మనదే

## ప్రజల కోసం పనిచేయాలి : బీఆర్‌ఎస్ విస్తృత సమావేశంలో అధినేత కేసీఆర్ పిలుపు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: "రాష్ట్రంలో బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం. రాబోయే రోజుల్లో అధికారం మనదే. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైంది. దాని గ్రాఫ్ పూర్తిగా పడిపోయింది. గత గాయాల నుంచి కోలుకున్న రాష్ట్రాన్ని మళ్లీ అదే స్థితికి తీసుకెళుతున్నారు. మరోసారి దోపిడీ, వలసవాదుల బారిన పడకుండా తెలంగాణను కాపాడాలి. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు తథ్యం. పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రస్తుత తరుణంలో పార్టీ అభ్యర్థులను గెలిపించి మన సత్తా చాటాలి" అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, సంస్థాగత ఎన్నికలు, భవిష్యత్ కార్యచరణపై ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, చారిత్రక బాధ్యతను నిర్వహించిన ప్రజల పార్టీగా బీఆర్‌ఎస్ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని ఈ సందర్భంగా కేసీఆర్ వ్యాఖ్యానిం చారు. "సీఎంపై, ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుందనుకోలేదు. ఆ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు శాపంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదు. వారి 14 నెలల పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోయింది, బీఆర్‌ఎస్ ఏటా ఆదా యం పెంచుకుంటూ వెళ్లింది" అని కేసీఆర్ తెలిపారు. అదే అధికారులు న్నారు కానీ.. ఈ ప్రభుత్వానికి పని చేయించుకోవడం కూడా చేత కావడం లేదని ఎద్దేవా చేశారు. తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే తమ బాధలు తీరుతా యని ప్రజలు భావిస్తున్న తరుణంలో నాయకులు, కార్యకర్తలు వారి నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలని సూచించారు. "ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ కాదు బీఆర్‌ఎస్. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించి చరిత్ర సృష్టించాం. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు పార్టీ శ్రేణులు కలిసి కట్టుగా కృషి చేయాలి" అని కేసీఆర్ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు.

పార్టీ నేతలపై కేసీఆర్ ఫైర్

బీఆర్‌ఎస్ నేతలపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఫైర్ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పలువురు నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎంపీ ఎన్నికల్లో ఓటమి చెందగానే, పార్టీ పనైపోయిందని మన నేతలే ప్రచారం చేశారని సీరియస్ అయ్యారు. పార్టీ నేతలు వ్యతిరేక ప్రచారం చేయడంతోనే 10 మంది ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారని మందలించారు. ఇలా ప్రచారం చేయడం పార్టీతో పాటు వ్యక్తిగత ప్రతిష్టకు నష్టం జరుగుతుందని హెచ్చరించారు. భవిష్యత్‌లో తప్పుడు ప్రచారాలు మానుకోవాలని వారికి హితవు పలికారు.

# విద్యారంగానికి బడ్జెట్‌ను పెంచాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులను పెంచాలని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం హైదరాబాద్‌లో విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. రాష్ట్రంలో వివిధ వర్గాలతో వరుస చర్చలు జరిపి వారి నుంచి అనేక సలహాలు, సూచనలను తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని మొత్తం అస్తవ్యస్థం చేసిందని పేర్కొన్నారు. దాని ఫలితంగా అభ్యాస పేదరికం ఏర్పడిందని వివరించారు. ప్రస్తుత విద్యారంగం దుస్థితి వల్ల ప్రజా, పౌర సమాజ సంస్థల నుంచి ఒత్తిడి, అశాంతి పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగంపై తగిన ఖర్చు చేసుకోవాలని కోరారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో రాష్ట్ర బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రూపొందించగల అభివృద్ధి, ప్రాధాన్యతలకు దిశానిర్దేశం చేయడం కోసం ఈ బడ్జెట్ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలతోపాటు విశ్వవిద్యాలయాలను ఉత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి కావాల్సిన బడ్జెట్‌ను తయారుచేసి సమర్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ఫౌండేషనల్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి అంతర్జాతీయ ప్రమాణాలు, ఉత్తమ అభ్యాస వాతావరణం, ఉత్తమ బోధనా వాతావరణంతో కూడిన ఉత్తమ పాఠశాల ప్రమాణాలు కలిగి ఉండేలా బడ్జెట్ తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిషన్ సభ్యులు పీఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ కొత్త సీఎంగా రేఖా గుప్తా..



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఢిల్లీ కొత్త సీఎం ఎవరనే అంశంపై కొనసాగిన ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఢిల్లీ నూతన ముఖ్య మంత్రిగా రేఖా గుప్తా ఎంపికయ్యారు. పలువురు సీనియర్ నేతల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ.. రేఖా గుప్తా వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గు చూపింది. షాలిమార్‌బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన 50 ఏళ్ల రేఖా గుప్తాకు ఢిల్లీ సీఎం పగ్గాలు అప్పగించడం విశేషం. ఏబీవీపీ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బీజేపీలో పలు విభాగాల్లో క్రియాశీలంగా కృషిచేశారు. అలాగే, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగానూ గతంలో సేవలందించారు.

ఢిల్లీకి నాలుగో మహిళా సీఎం..

రేఖా గుప్తా ఢిల్లీకి నాలుగో మహిళా సీఎంగా సేవలందించనున్నారు. గతంలో సుష్మాస్వరాజ్ (బీజేపీ), షీలాదీక్షిత్ (కాంగ్రెస్), ఆతిశీ (ఆప్) ముఖ్యమంత్రులుగా పనిచేసిన విషయం తెలిసిందే.

# ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభ.. కేసీఆర్ ప్రకటన



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ భవన్ లో మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అయితే ఈ సమావేశం లోకి రాగానే మాట్లాడడం మొదలు పెట్టిన కేసీఆర్. పార్టీ పని అయిపోయిందని కొందరు అనుకుంటున్నారు అంటూ స్పీచ్ స్టార్ట్ చేశారు. బయట వాళ్ళు కాదు.. మన పార్టీ వాళ్లే బీఆర్‌ఎస్ పని అయిపోయింది అని ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా ఖండించదగిన విషయం అని పేర్కొన్నారు కేసీఆర్. అదే విధంగా ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ నిర్వహించాలని కేసీఆర్ సూచించారు. అలాగే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలి అని తెలిపారు. ఈ ఏడాది పొడవున పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరగాలి అన్నారు. అలాగే పార్టీ కమిటీలను వేయాలని నిర్ణయం తీసుకున్నారు. కమిటీలకు ఇన్చార్జిగా హరీష్ రావుకు బాధ్యతలు అప్పగించారు. 100 శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం. ప్రజల కోసం పార్టీ నేతలు పని చేయాలి. ఏప్రిల్ 10 నుంచి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం.. ప్రతి జిల్లా కేంద్రంలో మొదలు పెడతాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

# ఖైదీలకూ గంగా జలం.. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు 55 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా కుంభమేళాలో పవిత్ర స్నానం చేయాలనుకుంటున్న ఖైదీల కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 75 జైళ్లలోని 90 వేలకుపైగా ఖైదీలకు గంగా జలాలతో స్నానం చేసే అవకాశం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలోని పవిత్ర జలాలను సేకరించి.. ఫిబ్రవరి 21న ఆయా జైళ్లకు తీసుకువెళుతామని అధికారులు పేర్కొన్నారు. ఆయా కారాగారాల్లో ఉన్న నీటితో గంగా జలాలను కలుపుతామన్నారు. పవిత్ర స్నానాల అనంతరం పూజలు, ఇతర క్రతువులు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర జైళ్ల శాఖ మంత్రి దారా సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కుంభమేళాలో పాల్గొనాలనుకునే ఖైదీల కోసం చరిత్రలో తొలిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు కులగణన సర్వేలో పాల్గొనాలి: మంత్రి పొన్నం




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కులగణనను ఓ ఎజెండాగా తీసుకుని బలహీనవర్గాలకు మద్దతుగా నిలవాలని ఆ పార్టీని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఇప్పటి వరకు కులగణన సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకోని వారి కోసం ఈ నెల 16వ తేది నుండి 28వ తేదీ వరకు మరోసారి ప్రభుత్వం కలుగణన సర్వే నిర్వహిస్తున్నదని ఆయన వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మంత్రి బీఆర్‌ఎస్ పార్టీ బలహీన వర్గాల పక్షాన సానుకూలంగా ఉన్నామని చెప్పేలా తొలుత కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సర్వేలో పాల్గొనాలని ఆ తర్వాత ప్రజలు భాగస్వామ్యులు అయ్యే విధంగా ఇవాళ జరుగుతున్న బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఈ ఎజెండాగా పార్టీ పక్షాన బలహీన వర్గాల పక్షాన సానుకూలంగా ఉన్నామని చెప్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. రీ సర్వేలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు పాల్గొనకుండా కేవలం విమర్శలకే పరిమితం అయితే తెలంగాణ బలహీన వర్గాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. మూడు పద్ధతుల్లో కుల సర్వేలో సమాచారం ఇవ్వడానికి అవకాశం కల్పించామన్నారు. దయచేసి తెలంగాణ సమాజంలో కులసర్వేలో ఇప్పటి వరకు తమ వివరాలు నమోదు చేసుకొని వారు ఇప్పుడు సమాచారం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం పక్షాన ప్రతి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. మొదటి విడత కుల సర్వే మిస్ అయిన వారందరినీ మోటివేట్ చేసి సర్వేలో భాగస్వాములు అయ్యేవిధంగా చూడాలని తెలంగాణ మేధావులకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. సర్వేలో భాగస్వామ్యులై తెలంగాణ జనాభా లెక్కల్లో ఉండే విధంగా చూసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్సీ కోడ్ నేపథ్యంలో ఒక్క లక్ష యాభై మూడు వేల రూపాయల డబ్బులను పట్టుకున్న ఎస్సై రవీందర్,.....




డబ్బులు పట్టుకున్న ఎస్సై రవీందర్

నిర్మల్ జిల్లా కుబీర్ ఫిబ్రవరి 19 అమృత్ తెలంగాణ కుబీర్ మండలంలోని సిరిపెల్లి గ్రామ శివారులో గల చెక్పోస్ట్ వద్ద డబ్బుల పట్టివేత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో బుధవారం పోలీసు తనిఖీల్లో భాగంగా కుబీర్ మండలం సిరపెల్లి గ్రామ శివరంలో గలా చెకపోస్ట్ వద్ద రాజేష్, కిన్వాట్ తాలూకా తల్లరి గ్రామం అనే వ్యక్తిని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బులు 153000 రూపాయలు భోకర్ నుంచి భైన్సా తీసుకెళ్తుండగా కుబీర్ ఎస్సై రవీందర్, ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పట్టుకోవడం జరిగింది.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి....



నిర్మల్ జిల్లా కుబీర్ ఫిబ్రవరి19 అమృత్ తెలంగాణ కుబీర్ మండలంలోని మార్లగొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తండ్రి బలిరామ్, ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జి విఠల్ రెడ్డి బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఆయన వెంట మాజీ జడ్పీటిసి శంకర్ చౌవన్, మాజీ ఏఎంసీ చైర్మన్ సంతోష్, మాజీ సర్పంచులు విజయ్,దత్తరం పాటిల్ సాయినాథ్, రాథోడ్ శ్యామ్ రావు, రాథోడ్ ప్రేమ్ సింగ్, జాదవ్ సోమ్లా జాదవ్, దము,జాదవ్ తారాచంద్, ఉన్నారు

## ఆర్టీసీ బస్సులో దొంగతనం ..

ముధోల్ :ముధోల్ బస్టాండ్లో ఆగి ఉన్నబస్సులో ఇద్దరు మహిళలు దొంగతనంకు పాల్పడిన సంఘటన బుధవారం ముధోల్ బస్టాండ్ లో చోటు చేసుకుంది. ముధోల్ ఎస్ఐ సంజీవ్ కథనం ప్రకారం .భైంసా నుండి నిజామాబాద్ కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ముధోల్ మండలంలోని అష్టా గ్రామానికి చెందిన సునీత అనే ప్రయాణికురాలు తన ఇద్దరి పిల్లలతోని నిజామాబాద్ కువెళ్లేందుకు బస్సులో ఎక్కింది.వెంటనే పిల్లలు త్రాగే నీళ్ళు కావాలని చెప్పటంతో పిల్లలను బస్సులో కూర్చోబెట్టి తీసుకొని వచ్చింది. సదరు మహిళకు సంబంధించిన బ్యాగ్ నుండి సెల్ ఫోన్ , వేయి రూపాయాల నగదు,కనిపించకపోవటంతో ఈ విషయం బస్సు డ్రైవర్ కు బాధిత మహిళ తెలిపారు.

## జగదంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి,



జగదంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



బంజారాల ఆరాధ్య గురువుతో విట్టల్ రెడ్డి



నిర్మల్ జిల్లా కుబీర్ ఫిబ్రవరి 19 అమృత్ తెలంగాణ కుబీర్ మండలంలోని రంగ శివుని తండాలో శ్రీ జగదాంబ మాత శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ శాసనసభ్యులు జి విఠల్ రెడ్డి, శ్రీ ప్రేమ్ సింగ్ మహారాజ్ గారి ఆశీస్సులు కూడా తీసుకోవడం జరిగింది. మాజీ శాసనసభ్యులు వెంట మాజీ జెడ్పిటిసి శంకర్ చౌవాన్ మాజీ ఏఎంసి చైర్మన్ సంతోష్ మాజీ సర్పంచ్లు విజయ్,దత్తరం పాటిల్, దిగంబర్ పటిల్, సాయినాథ్ మరియు గ్రామ మాజీ సర్పంచ్ గ్రామ ఉపసర్పంచ్ మరియు ఆలయ కమిటీ సభ్యులు నాయక్ కారోబారి మరియు ఇతరులు ఉన్నారు.

# గ్రాడ్యుయేట్ పట్టభద్రుల బీఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు భారీ మద్దతు

### నిరుద్యోగులు ఉద్యోగులు అందరూ ఆయన వైపే.,...... ఆందోళనలో బిజెపి కాంగ్రెస్ అభ్యర్థులు



శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్నకుమార్



ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్నకుమార్ ను ఘనంగా పూలమాలతో సన్మానిస్తున్న దృశ్యం



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ జిల్లా భైంసా, ఫిబ్రవరి 19: అమృత్ తెలంగాణ భైంసా గ్రాడ్యుయేట్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, కు భైంసాలో భారీ ప్రజా మద్దతు లభిస్తోంది. వివిధ సర్వేల్లో మొదటి స్థానంలో నిలుస్తున్న ఆయనకు పట్టభద్రులు విశేష ఆదరణ చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో భైంసా పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు ప్రచారం నిర్వహించారు. ముందుగా శివాజీ చౌక్ వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొని, మహారాజ్ విగ్రహానికి పూలమాలలు అర్పించారు. అనంతరం డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. ఉద్యోగ భద్రత, హెల్త్ ఇన్సూరెన్స్, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ పట్టభద్రుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత, హెల్త్ ఇన్సూరెన్స్, మహిళా సాధికారత లాంటి అంశాలను ముందుకు తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

"నేను ప్రశ్నించే గొంతుక"

తాను 19 సంవత్సరాలు ప్రభుత్వ సేవలో ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై పోరాటం చేయడానికి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నట్లు చెప్పారు. "నేను ప్రశ్నించే గొంతుకను, న్యాయమైన పోరాటాల కోసం నన్ను ఉపయోగించుకోండి" అని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.

నంబర్ 3 – మొదటి ప్రాధాన్యత ఓటు ప్రసన్న హరికృష్ణ ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడమే లక్ష్యం అని స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్లో నంబర్ 3 లో ఉన్న తనకు, మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టభద్రులు, సంఘాల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.

## ఘనంగా శివాజీ జయంతి వేడుకలు... వేడుకల్లో పాల్గొన్న నాయకులు



కుస్లీలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



బామ్ని బి లో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



నర్సాపూర్ జి లొ ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు కుస్లీ, బామ్ని బి గ్రామంల లో శివాజీ జయంతి వేడుకలు మరాఠా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో మరాఠా సంఘ అధ్యక్షులు నర్వాడీ గణేష్ పాటిల్, ప్రధాన కార్యదర్శులు గొడ్కే వెంకట్ రావు పాటిల్, మరాఠా సంఘ సభ్యులు, విడిసి సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని శివాజీ, విగ్రహానికి పూలమాలలతో ఘనంగా వేడుకలు నిర్వహించడం జరిగింది

## ఘనంగా శివాజీ జయంతి వేడుకలు..... ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై సాయికిరణ్



నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి 19 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వంచడం జరిగింది. జయంతి వేడుకల్లో ఎస్సై సాయికిరణ్ మాజీ ఎంపీపీ రేఖ రమేష్, బిజెపి మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, నాయకులు కార్యకర్తలు సవీన్, లక్ష్మణ్, పల్లపు రాజు, దర్శనం రాజు,గంగారాం, మహేష్, దేవేందర్,విజయ్, హరీష్, గాడి రాజు, సుధాకర్ మరియు యువకులు పాల్గొన్నారు...



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల సేకరణ పై సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణా ఆదిత్య బుధవారం ఉమ్మడి జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆదిలాబాద్ కలెక్టరేట్ కు చేరుకున్న సందర్భంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు.

## బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తెలిపారు.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కన్సాలిటేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు వివిధ రుణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల బ్యాంకు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని వారు. విస్తృత అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నియంత్రించవచ్చునని తెలిపారు. ఇప్పటివరకు ప్రజలకు బ్యాంకులో అందజేసిన రుణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశం అనంతరం అదనపు కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా పొటెన్షియల్ లింకుడ్ క్రెడిట్ ప్లాన్ 2025–26 సంచికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, నాబార్డు డిడిఎం వీరభద్రుడు, డిఆర్డిఓ విజయలక్ష్మి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామారావు, ఆర్బిఐ ఎల్బిఓ దేవ్ జిత్ బారువ, జిల్లా అధికారులు, బ్యాంకర్లు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీల గుడిసెలను కూల్చివేయడం దారుణం

జన్నారం.అమృత్ తెలంగాణ:మండలంలోని దేవునిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల గడ్డంగూడలో తరతరతరాలుగా నివాసం ఉంటూ అక్కడే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న మా లంబాడా గిరిజనుల గుడిసెలను కూల్చివేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని లంబాడ హక్కుల జాగృతి సమితి నాయకులు అన్నారు. మంగళవారం తెల్లవారుజామున అటవీ అధికారులు సుమారు 2గంటల ప్రాంతం లొ ఒక్కసారిగా దాడి చేసి నిద్రిస్తున్న సమయంలో జేసీబీలు, ట్రాక్టర్ లు పెట్టి చిన్న పిల్లలు ముసలి వాళ్ళు, మహిళలు అని ఏమి చూడకుండా విధ్వంసం సృష్టించి ఇండ్లను కులగొట్టినారన్నారు . నాయక్. భరత్ నాయక్, రాజు నాయక్ శ్రీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల ఉన్నతీకరణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ అంగన్వాడీల అభివృద్ధి, ఉన్నతీకరణ, తదితర అంశాలపై సంక్షేమ శాఖ జేడి బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు అంగన్వాడీలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రతి అంగన్వాడి కేంద్రాలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్ లో సిడిపిఓ నాగలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూలును వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం నిర్మల్ పట్టణంలో వివిధ కాలనీలలో జరుగుతున్న పన్నుల వసూలు, వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియను మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆస్తి పన్నుతో సహా అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించాలని వ్యాపారస్తులకు సూచించారు. నిర్ణీత గడువులోగా వాణిజ్య లైసెన్సులను పునరుద్ధరించుకోవాలన్నారు. సకాలంలో పన్నులను చెల్లించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దివ్యగార్డెన్ సమీపంలోని అర్బన్ పార్కును పరిశీలించి పార్కు అభివృద్ధికి పలు కీలక సూచనలు చేశారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా పార్కును తీర్చిదిద్దాలన్నారు. పార్కు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డిఈ హరి భువన్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమీకృత గురుకుల పాఠశాల (యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ) స్థల సేకరణ పై సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణా ఆదిత్య బుధవారం అదిలాబాద్ కలెక్టరేట్ కు చేరుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు.









అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి అదిలాబాద్ రూరల్ నిషాన్ ఘాట్ ను పరిశీలించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థలో ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకురావడం కోసం ప్రయోగాత్మకమైన అడుగులు వేయడం జరుగుతుందని, ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ రెండు సంవత్సరాలలో నిర్మించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం లక్ష్యం కాగా, ఈ సందర్భంగా బుధవారం కమీషనర్ కృష్ణదిత్య ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సమీకృత గురుకుల పాఠశాల కు అవసరమైన స్థలాల సేకరణ వేగవంతం చేసి రేపటి లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించతలపెట్టిన సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయం కోసం అదిలాబాద్ రూరల్ నిషాన్ ఘాట్ లో స్థలాన్ని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారుల తో కలిసి క్షేత్రస్థాయిలో ఈ ప్రాంతాన్ని సందర్శించి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం తదితర అంశాలను పరిశీలించారు. 20 ఎకరాల స్థలం సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని నిషాన్ ఘాట్ లో 38 వ సర్వే నెంబర్ లో 20 ఎకరాల భూమిని సోషల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ వింగ్ కు (EETGEWIDC ) ను, నిర్దేశిత గడువులోగా పనులు ప్రారంభించేల ప్రణాళికలు తయారుచేసి , ఎక్కడైతే స్థలాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన చోట అనుమతులు, ఇతర పనులను వేగంగా చేయాలని ఆదేశించారు. ప్రతిపాదిత స్థలాలు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో ముందుగా పరిశీలించాలని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ ఛాంబర్ లో కమిషనర్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ విద్యా పై సమీక్షిస్తూ సీసీ కెమెరాస్ గురించి, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ సజావుగా జరగడం , థియరీ ఎగ్జామ్స్ ను పకడ్బందీ గా నిర్వహించాలని DIEO సి.రవీందర్ కుమార్ ను ఆదేశించడం జరిగింది. ఏజీఎంసీ జిల్లా అధికారులతో కళాశాలలో హాజరు శాతం, స్లిప్ టెస్టులు, అడ్మిషన్ drive గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రెవెన్యు డివిజనల్ అధికారి వినోద్ కుమార్, ఉమ్మడి జిల్లా ఇంజనీరింగ్ వింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం సాయంత్రం దిలావార్ పూర్ మండలం సిర్గాపూర్ గ్రామ సమీపంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన సముదాయానికి కేటాయించిన సర్వే నెంబరు 664 లో గల 17 ఎకరాల 09 గుంటల భూమిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణ, తదితర అంశాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. భవన నిర్మాణాలను అన్ని హంగులతో నిర్మిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, డిఐఈఓ పరశురాం, డిఈ గంగాధర్, తాహసిల్దార్ స్వాతి, ఏఈ తుకారం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీరు, విద్యుత్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి : సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమీషనర్ కృష్ణ ఆదిత్య.







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్. తెలంగాణ అదిలాబాద్ అదిలాబాద్ జిల్లా బుధవారం వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని, రానున్న వేసవిలో జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కమీషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు, కరెంట్ కోతల కు సంబంధించి గతంలోని అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని అవాసలలో అన్ని చర్యలూ తీసుకోవాలని అన్నారు. బోరు బావుల ఫ్లషింగ్, ఇతర నిర్వహణ పనులు ముందుగానే చేపట్టాలన్నారు. వేసవి ప్రభావం ఇప్పటి నుండే ప్రారంభమైందని, మే, జూన్‌లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వంటి అంశాలు కారణంగా నీటి ఎద్దడి ఎక్కువ ఉండే అవకాశం ఉందని, కావున పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు

అలాగే మున్సిపల్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య , కరెంట్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని చెప్పారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## పీఎం శ్రీ కార్యక్రమం లో భాగంగా విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఉజ్వల భారతదేశం కోసం ప్రధానమంత్రి పాఠశాలలు (పీఎం శ్రీ) కార్యక్రమం లో భాగం గా అధికారులు విద్యార్థుల కోసం క్షేత్ర పర్యటనలు (ఫీల్డ్ ట్రిప్స్) ప్లాన్ చేసారు.. దీనిలో భాగంగా బుధవారం గుడిహత్నూర్ లోని ప్రభుత్వ మోడల్ స్కూల్ మరియు ఉన్నత పాఠశాల, యాపాల్ గూడ విద్యార్థులు ఉట్నూర్ లోని ఐటిడిఏ ఉద్యాన నర్సరీని సందర్శించారు. వీరికి ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్ వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు మనం తినే ఆహారాన్ని, రైతులను గౌరవించాలని, రైతులు ఆరుగాలం కష్టపడితేనే మనకు ఆహారం లభిస్తుందని, రైతుల గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. విద్యార్థులు అడిగే పలు ప్రశ్నలకు సందీప్ కుమార్ సమాధానాలు ఇచ్చారు. రోజువారి ఆహారంలో పండ్లు కూరగాయల పాత్ర చాలా ప్రాముఖ్యమైనదని ఆరోగ్య సంరక్షణలో పండ్లు, కూరగాయలు ఆకుకూరలు ఎంత గానో ఉపయోగపడతాయని తెలిపారు. మామిడి, జామ, నిమ్మ, మునగ, సపోటా తోటల్లో తిరుగుతూ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ కాలేజీ గుడిహత్నూర్ ప్రిన్సిపల్, యపాల్ గూడ హై స్కూల్ హెడ్మాస్టర్, టీచర్లు, 500 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిశాన్ఘాట్ ప్రజలకు విద్యుత్ సౌకర్యం కల్పించకపోతే పోరాటాలు తప్పవన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ జిల్లా విద్యుత్ శాఖ సిపిఐ కార్యాలయం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరముల నుండి నిశాన్ఘాట్లో ప్రజలు గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఓడించి ఈ ప్రజా పాలన ప్రభుత్వంను కాంగ్రెస్ సర్కార్ను అధికారంలోకి తీసుకొని రావడం జరిగిందన్నారు అధికారంలోకి వచ్చిన ప్రజా పాలనా కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం నర కావాల్సి వస్తుందన్నారు కానీ ప్రజల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని ఆయన తెలుపుతూనే వెంటనే నిశాన్ఘాట్ లో గుడిసెలు వేసుకొని బతుకుతున్నటువంటి ప్రజలకు పాములు తేళ్లు అడవి జంతువుల అపాయల నుండి కాపాడవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం పైన లేదా అని మండిపడ్డారు ఇప్పటికైనా వెంటనే నిశాన్ఘట్కు కరెంట్ సౌకర్యం కల్పించి గుడిసెలు వేసుకొని బతుకుతున్న ప్రజలకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి విద్యుత్ శాఖ అధికారి గవినతి పత్రాన్ని అందించి అతి తొందరగా కరెంట్ సౌకర్యం కల్పించక పోతే నిశాన్ఘాట్ ప్రజలందరిని ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అధికారులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిల్కా దేవదాస్, మేస్రం భాస్కర్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కట్ట చంద్రమౌళి, గేడం కేశవ్ గేడం, పాచ్చిరాం, సిపిఐ సీనియర్ నాయకులు కట్ట క్రిష్ణ స్వామి, కట్ట కిష్టయ్య, మిషన్ఘట్ సాధన కమిటీ సభ్యులు పి. సంగీత, ఎ. సంగీత, ఎస్.కె శభానా, సునీత, కల్పన, ప్రదీప్, రమేష్ చౌహాన్. కె. మారుతీ, క్రిష్ణ, ఖలీల్, ఎస్.కె .ఉస్సేన్, నిశ్వర్, మున్ని, రాఫీయా, తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ తో కాంగ్రెస్ బలోపేతం

### ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ గోవింద్ నాయక్ బాణావత్





గోవింద్ నాయక్

అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి గా నియమితులైన మీనాక్షి నటరాజన్ తో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నిర్మల్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ అన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ట్రైకర్ చైర్మన్ డాక్టర్ తేజవత్ బేల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో నాగార్జున్ సాగర్ లో ఇటీవల కాలంలో ఏడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించరు. ఈ శిక్షణ తరగతులకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి ఏఐసిసి కార్యదర్శి మీనాక్షి నటరాజన్ పాల్గొని భారత్ రాజ్యాంగం పట్ల అవగాహనా కాంగ్రెస్ పార్టీ గత 75 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ గురించి వివరించారాని అయన తెలిపారు మీనాక్షి నటరాజన్ తెలంగాణ కు ఇంచార్జి గా రావడం తో ప్రతి కార్యకర్తలు సంతోషంగా ఉన్నారని గోవింద్ నాయక్ చెప్పారు

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి..

జన్నారం: అమృత్ తెలంగాణ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కిష్టాపూర్ గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. డైనింగ్ హాల్ కు వెళ్లి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం పై ఆరా తీశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే సక్రమమైన చికిత్సలు అందించాలన్నారు. సమయపాలన పాటిస్తూ, డాక్టర్లు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు, అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చక చక సమాధానాలు చెప్పారు. దీంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. మండల ఎంఈఓ విజయ్ కుమార్, కేజీబీవీ పాఠశాల



ప్రిన్సిపల్ శ్రీవాణి, మండల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# జన్నారంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు..



జన్నారం :అమృత్ తెలంగాణ: భరతమాత ముద్దుబిడ్డ ధైర్యానికి దేశ భక్తికి ధీరత్వానికీ దైవభక్తికి మారుపేరు చత్రపతి శివాజీ అని బీ సీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కడార్ల నరసయ్య అన్నారు. బుధవారం చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా అతని చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత జీవించాలని సంఘములో సమాజంలో రుగ్మతలను రూపుమాపాలని కోరినారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ మంచిర్యాల డివిజన్ మోకు దెబ్బ అధ్యక్షుడు ఒల్లాల నరస గౌడ్ మండల పూసల సంఘం నాయకుడు గుడ్ల రాజన్న యువ నాయకులు పర్ల శంకర్ కొండపెల్లి మహేష్ అత్తె రఘు ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంధ్ర పురుషోత్తం భూతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ స్వరాజ్య స్థాపనకు పునాది వేశాడు..

జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను గ్రామ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా హిందూ ధర్మ జాగృతి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు జంగం సంతోశ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శివాజీ శౌర్యం, దార్శనికతతో స్వరాజ్య స్థాపనకు పునాది వేశాడని కొయాడారు. అనంతరం జన్నారం మండల కేంద్రంలో హిందూ వాహిని, హిందూ జాగృతి సేన, బిజెపి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

# ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమం..


హలియా :అమృత్ తెలంగాణ: ఛత్రపతి శివాజి మహారాజ్ 395 వ జయంతి కార్యక్రమాన్ని ఆర్యక్షత్రియ సంఘం మరియు ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు కలిసి హాలియా పట్టణంలో ఘణంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా హాలియా పట్టణం లోని శివాజీ విగ్రహానికి పూల మాలలతో అలంకరించి, విగ్రహాన్ని పాలతో అభిషేకహించి అనంతరం పట్టణ పుర వీడులల్లో శోభయాత్ర ఘనంగా నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్య క్రమంలోఆర్య క్షత్రియ సంఘం అధ్యక్షులు ముజ్జా శివరామయ్య గారు గౌరవ అధ్యక్షులు ముజ్జా శ్రీహరి గారు, ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు చిందే లక్ష్మణ్ రావు గారు, గౌరవ అధ్యక్షులు గాయాకవాడ శివన్నారాయణ గారు.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కుందూరు వెంకట్ రెడ్డి ,హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు వద్దే సతీష్ రెడ్డి నాయకులు బందిలి పెద సైదులు, మురళి అయ్యగరు మాజీ కౌన్సిలర్ వర్ర వెంకట్ రెడ్డి మరియా ఆర్యక్షత్రియ సంఘం నాయకులు కాళే పెద మాలకొండయ్య , సీతారాంబాబు కాళే నారాయణ, ముజ్జే



నారాయణ , చిందే గోవిందు ముజ్జా కొండల్ రావు , చిందే వెంకటేశ్వర్లు, కాళే నవీన్ , జజం పరమేశ్వరరావు, ముజ్జా రవి, ముజ్జా బాలకొండయ్య మొదలగు వారు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయంతం చేశారు.

# వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టండి..

సూర్యాపేట :అమృత్ తెలంగాణ: జిల్లాలోని వచ్చే మూడు మసాల్లో ఎక్కడకూడా నీటి ఎద్దడి సమస్యలు రాకుండా పక్కా ప్రణాళికతో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇమామ్ పేట లోని మిషన్ భగీరద నీటి శుద్ధి 95 ఎం ఎల్ డి కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు దిశానిర్దేశయం చేసారు.నీటి శుద్ధి కేంద్రం పరిధిలోని రెండు మున్సిపాలిటీలు సూర్యాపేట మరియు కోదాడ, అలాగే మండలాలు చిలుకూరుకింద (19)గ్రామాలు, కోదాడ కింద (24)గ్రామాలు, అనంతగిరి కింద (24) గ్రామాలు,,మునగాలకింద (32) గ్రామాలు,నడిగూడెం కింద (17)గ్రామాలు,పెన్ పహాడ్ కింద (52) గ్రామాలు అదేవిదంగా సూర్యాపేట పరిధిలోని (15) గ్రామీణ ఆవాసాలు, 4 విలీన ఆవాసాలు లకు మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరా వేసవిలో నిరంతరం జరగాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో మిషన్ భగీరథ ఈ ఈ అరుణాకర్ రెడ్డి గ్రిడ్, ఈ ఈ శ్రీనివాస్ రావు ఇంట్రా, డిపిఓ నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మిషిన్ భగీరథ డి ఈ రాజేందర్ పాండు పాల్గొన్నారు.




# జీపీ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎంపీడీఓ కు వినతి

కుబీర్ :అమృత్ తెలంగాణ: గ్రామపంచాయతీ లో ఉన్న సమస్యలను గత బిఆర్ ఎస్ ప్రభుత్వం లో గత ఏడాది ఆగస్టు నెల నుంచి పెండింగ్ చెక్కు లను నిధులను విడుదల చేయాలనీ మండల అధికారి నవనీత్ కుమార్ కు బుధువారం మండల కేంద్రంలో మండల పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లు పెండింగ్ బిల్లు లను విడుదల చేయాలనీ ఎంపీడీఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా మండల పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరా పీబ్రవరి లో పాలకవర్గం కలపరమితి ముగియాడంతో రోజువారీ నిర్వహణ అయినా పారిశుధ్య పనులకు కావాల్సిన ట్రాక్టర్ డిజిల్,



నిర్వహణ తదితర పనుల గురించి డబ్బులు ఖర్చు చేసి ఇప్పటి వరకు చెక్కు లను విడుదల చేయాలనీ తెలపడం జరిగింది. దింతో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుంది దింతో గ్రామంలో ఉన్న పెండింగ్ బిల్లు లకు సంబదించిన చెక్కు లను విడుదల చేయాలని కోరారు.


# మృణాల్ ఠాకూర్ తో వైజయంతీ లేడీ ఓరియేంటెడ్!



సీతారామం' హిట్ తో మృణాల్ ఠాకూర్ ఒక్కసారిగా ఫేమస్ అయిపోయింది. సీత పాత్రలో అమ్మడు ఒదిగిపోయిన వైనం ఆద్యంతం మెప్పించింది. అచ్చంగా సీతనే దిగొచ్చిందా? అన్నంతగా ప్రేక్షకుల్ని అలరించింది. దీంతో ఈ మరాఠీ బ్యూటీకి లేడీ ఓరియేంటెడ్ ఆఫర్లే తలుపు తడుతున్నట్లు ప్రచారం సాగుతుంది. ఒక్క హిట్ కే కథానాయిక ప్రాధాన్యం గల సినిమాలా? అని ఒకింత షాక్ అయినా నమ్మాల్సిన నిజంగానే కనిపిస్తుంది. వాస్తవానికి సీతారామం రిలీజ్ అయిన మరుక్షణమే వెబ్ మీడియా ఈ తరహాతో కథనాలు వెడెక్కించింది. కానీ ప్రాజెక్ట్ అధికారికం కాకపోవడంతో ప్రచారంగానే మిగిలిపోయింది. అయితే తాజా అప్ డేట్ అంతకు మించి కనిపిస్తోంది. మృణాల్ తో ఏకంగా అగ్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ నే ఓ లేడీ ఓరియేంటెడ్ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం మృణాల్-నిర్మాణ సంస్థ మధ్య స్క్రిప్ట్ చర్చలు జోరుగా సాగుతున్నాయి... వీలైనంత వేగంగా ఆ పనులు పూర్తిచేసి సినిమా ప్రారంభించాలని భావిస్తున్నారు. కొన్నాళ్లగా అశ్వీని దత్ కుమార్తెలిద్దరు సంస్థని హిట్ కంటెంట్ తో పరుగులు పెట్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ బ్యానర్ లాక్ చేసిన స్టోరీ కి హిట్ తప్ప మరో ఆప్షన్ లేకుండా చేస్తున్నారు. ఇదే బ్యానర్లో కొత్త వాళ్లని సైతం పరిచయం చేసి హిట్ అందుకోవడం ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈనేపథ్యంలో మృణాల్ కి మరోసారి లక్కీ ఛాన్స్ దొరికిందనే చెప్పాలి. స్టోరీ సహా మేకింగ్ పరంగా నూరుశాతం సానబెట్టే కంటెంట్ ని బయటకు వదులుతారు. ఇక నిర్మాణ విలువలు గురించి చెప్పాల్సిన పనిలేదు.

# ముద్దుగుమ్మ కెరీర్ ఖతం అయినట్లేనా...?

అక్కడ స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాల్లో నటించింది. శ్రీలంక నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ హిందీ రియాల్టీ షో ద్వారా ప్రేక్షకులకు పరిచయం అయింది. శ్రీలంకలో టెలివిజన్ రిపోర్టర్‌గా పని చేసిన జాక్వెలిన్ తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. అక్కడ స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాల్లో నటించింది. కానీ ఈ మధ్య కాలంలో ఈ అమ్మడి సినిమాల జోరు తగ్గింది. ముఖ్యంగా ఈమెకు వరుస ఫ్లాప్స్ పడటంతో పాటు, కేసులు చుట్టు ముట్టడంతో కెరీర్ పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. జాక్వెలిన్ కెరీర్ ఖతమేనా అనే చర్చ ప్రారంభం అయింది. బిగ్ గ్యాంబ్లింగ్ ఈ మధ్య కాలంలో జాక్వెలిన్ ఎక్కువగా సోషల్ మీడియాలో కనిపిస్తుంది. సినిమాల్లో అడపా దడపా సినిమాలు చేసినా అవి ప్రత్యేక పాత్రలు, ప్రత్యేక పాటలు మాత్రమే. దాంతో ఆమె కెరీర్‌లో తిరిగి పుంజుకుంటుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతుంది. గత ఏడాదిలో ఈమె చేసిన సినిమాలు తక్కువే ఉన్నాయి. అవి కూడా ఈమెకి పెద్దగా ఆఫర్లు తెచ్చి పెట్టే పరిస్థితి లేదు. ఆ కారణంగానే జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఈ ఏడాదిలో చేసే సినిమాలు ఎన్ని, ఆమెకు దక్కే సక్సెస్‌లు ఎన్ని అనే విషయంలో సందిగ్ధం నెలకొంది. సాధారణంగా ఒక హీరోయిన్ వరుసగా ఫెయిల్యూర్స్‌ను చవిచూస్తే కెరీర్ పరంగా డౌన్ ఫాల్ మొదలు అయినట్లే అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 2009లో మోడలింగ్‌తో కెరీర్‌ను ఆరంభించిన ఈ అమ్మడు సుజోష్ ఘోష్ యొక్క ఫాంటసీ సినిమా అలాడిన్ కోసం ఆడిషన్స్‌కి వెళ్లింది. అక్కడ మొదలైన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ సినీ ప్రస్థానం కంటిన్యూ అవుతూ వచ్చింది. దాదాపు దశాబ్ద కాలం పాటు




వరుస సినిమాలు చేస్తూ వచ్చిన ఈ అమ్మడు ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. పలు అవార్డులను రివార్డులను అందుకుంది. అంతే కాకుండా ఆ సమయంలోనే ఎన్నో షోల్లోనూ జాక్వెలిన్ కనిపించి మెప్పించింది. ఈమె నటించిన బాలీవుడ్ కిక్ 2014లో ప్రేక్షకుల ముందుకు వచ్చి అత్యధిక వసూళ్లు రాబట్టింది. హౌస్ ఫుల్ 3తో 2016లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె ఆ తర్వాత కూడా పలు సినిమాలతో సక్సెస్‌లను సొంతం చేసుకుంది. అయితే గత నాలుగు అయిదు సంవత్సరాలుగా ఈమె కెరీర్‌లో సాలిడ్ సక్సెస్ పడలేదు. ఐటెం సాంగ్స్ చేసినా పెద్దగా ప్రతిఫలం దక్కలేదు. దాంతో ఈ అమ్మడికి సినిమాల్లో ఆఫర్లు తగ్గాయి. ముందు ముందు ఈమెకు ఐటెం సాంగ్స్‌లోనూ ఆఫర్లు వచ్చే పరిస్థితి లేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మళ్లీ బుల్లి తెరపై ఈమె తన ప్రస్థానం మొదలు పెట్టాల్సి ఉంటుందేమో అని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాదిలో కనీసం ఒక్కటి లేదా రెండు సినిమాల్లో అయినా హీరోయిన్‌గా నటించి హిట్ కొడితేనే జాక్వెలిన్ కెరీర్ కొనసాగే అవకాశాలు ఉన్నాయి. లేదంటే కెరీర్ ఖతం అయినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# బుట్ట బొమ్మను ఇలాంటి లుక్‌లో చూశారా ఎపుడైనా?

ఓవరాల్ గా ఈ ఫోటోషూట్ లో ఇది యూనిక్ లుక్ అనడంలో సందేహం లేదు. ముంబై బ్యూటీ పూజా హెగ్డే ఇటీవల చెన్నై సర్కిల్స్ లోనే ఎక్కువగా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో ఈ బ్యూటీ నిరంతరం తన అభిమానులను అలరించేందుకు వరుస ఫోటోషూట్లతో ప్రత్యేక గేమ్ ని ప్లాన్ చేసింది. ఇటీవలే స్టైలిష్ బ్లేజర్ లో స్పెషల్ లుక్ లో కనిపించిన పూజా, ఇంతలోనే ఇప్పుడు ప్రఖ్యాత హెచ్.టి టైమ్ కవర్ షూట్ లో పాల్గొంది. ఈ కవర్ ఫోటోషూట్ కోసం పూజా మరింత బోల్డ్ గా మారింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ కి సంబంధించిన ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. పూజా రకరకాల డిజైనర్ లుక్స్ లో కనిపించగా, వీటిలో పట్టీలతో రూపొందించిన ఒక ప్రత్యేకమై డిజైనర్ డ్రెస్ తనలోని హాట్ కంటెంట్ ని మరింత హైలైట్ చేసింది. ఓవరాల్ గా ఈ ఫోటోషూట్ లో ఇది యూనిక్ లుక్ అనడంలో సందేహం లేదు. పూజా హెగ్డే కు బాలీవుడ్ ఆశించిన విధంగా కలిసి రాలేదు. అక్కడ మంచి ఫలితాలు రాలేదు. అదే సమయంలో కోలీవుడ్ టాలీవుడ్ తనను ఆదుకున్నాయి. అయితే ఇటీవల భారీ పారితోషికం, ఇతర డిమాండ్ల కారణంగా పూజా తెలుగు చిత్రసీమలో ఉనికిని కోల్పోయింది.




## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



మీనాక్షి క్యూట్ స్టైల్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com